క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తి


టాయిలెట్లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేపల్లి, కొత్తలింగాల, లింగాల, జాస్తిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన టాయిలెట్లను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీడీ సుమ, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీర రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పొదిల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఖమ్మంలోని రాతి దర్వాజ ప్రాంతంలో గల జిల్లా సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో తాము కీలకంగా పని చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ తరపున గెలిచి మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు తమ సంఘం తరపున అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అర్వపల్లి సుధాకర్, కోశాధికారి బూర్ల పుల్లారావు, షేక్ సలీం, కొమర్రాజు మాధవరావు, ఈవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దాతృత్వం


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కూసుమంచి: నాయకన్‌గూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌కుమార్ గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. అతడి కాలుకు ఆపరేషన్ చేశారు. ఇందుకు రూ.2 లక్షల వరకు ఖర్చు కావడంతో మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ వంతుగా రూ.70 వేలను విరాళాలుగా సేకరించి శుక్రవారం వెంకట్‌కుమార్‌కు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిందర్ రెడ్డి, సెక్రటరీ ఎం.నర్సయ్య, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికిరణ్, కృష్ణారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ

కూసుమంచి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఆర్‌డీఎస్ ఎనేబుల్ సంస్థ ఆధ్వర్యాన దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. ఎంపిక చేసిన 35 మంది దివ్యాంగులకు పది రోజుల పాటు వ్యాపారాభివృద్ధి నైపుణ్యతపై శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణానంతరం అందించే సర్టిఫికెట్లతో వారు స్వయం ఉపాధి పొందడానికి దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీఎస్ డైరెక్టర్ గద్దం రాంబాబు, ఆర్‌సీటీ ప్రతినిధి నగేశ్, యువ దివ్యాంగుల సంస్థ డైరెక్టర్ మధు, ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు రంగ, గోపి, రామారావు, శ్రీను, రేణుక, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సంచార ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని చర్చి కాంపౌండ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఖమ్మంతో పాటు కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామంలో పేద ప్రజలకు వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరినాథబాబు, స్టాఫ్ నర్సు బిందు, సాయినాథ్, ఎండీ గౌస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాధినేని జనార్దన్‌రావు, కార్యనిర్వాహణాధికారి సూర్యప్రకాశ్‌రావు, కార్యదర్శి జెల్లా వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి వేళాయె..


మంగాపురంలో నాట్లు వేస్తున్న కూలీలు

సాగు పనిలో నిమగ్నమైన రైతాంగం

- సాగర్ నీరు రాకపోయినా బోరు, బావుల కింద సాగుకు సమాయత్తం
- కుటుంబ పోషణకైనా పండించాల్సిన పరిస్థితి
- తక్కువ పంటకాలం రకాల వైపే మొగ్గు
- 15వ తేదీలోగా నార్లు పోసుకోవాలని అధికారుల సూచన


నేలకొండపల్లిలో ఏపుగా పెరిగిన వరి నారు

నేలకొండపల్లి: నిన్నటి వరకు ఓట్ల పండగతో ఊరూరా నాయకుల ప్రచార సందడి, మైకుల మోత, ఇంటింటి ప్రచారం బంధుగణం రాక, చివరి రోజు పంపకాలతో గడిచిపోయింది. కానీ ప్రస్తుతం యాసంగి సీజన్ ఆరంభం కావడంతో రైతులు సాగువైపు దృష్టి సారించారు. సాగర్ నీరు రాకపోయినా.. బోర్లు, బావుల ద్వారానైనా సాగు చేయాలని వరి నాట్లు పోసుకుంటున్నారు. వానాకాలం కంటే కొంతమేర సాగు తగ్గినా.. పాలేరు డివిజన్‌లో వేలాది ఎకరాలు వరి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తప్పని సాగునీటి కష్టాలు..

జలాశయాల్లో వరద లేకపోవడం, నిల్వలు చాలా తక్కువగా ఉండడంతో ఈసారి రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలా లేదు. అయినప్పటికీ రైతులు మాత్రం సాగు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం చెరువుమాధారం చెరువు కింద ఆయకట్టులో వరి నాట్లు ప్రారంభించగా.. వ్యవసాయ బోరు, బావుల కింద చాలా చోట్ల నాట్లు వేసేందుకు దుక్కులు దున్ని సాగుకు సిద్ధమయ్యారు. కష్టాల సాగు అయినప్పటికీ కనీసం కుటుంబాలను పోషించుకోవడానికైనా సాగు చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందని రైతులు భావిస్తున్నారు. దీంతో తక్కువ పంట కాలం ఉన్న రకాలు 90 రోజులు నుంచి 120 రోజులకే పంట చేతికొచ్చే రకాలు సాగు చేయడంతో మంచి జరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు.

తగ్గనున్న వరి సాగు..

పాలేరు డివిజన్‌లో గతంలో 60 వేల ఎకరాల్లో వానాకాలం వరి సాగు చేస్తే.. గత యాసంగిలో 62 ఎకరాల్లో వరి సాగు చేశారు. వానాకాలం కంటే కూడా అదనంగా సాగు చేయడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటిపోవడంతో యాసంగిలో పెద్ద ఎత్తున సాగు చేయడానికి రైతులు వెనుకంజ వేస్తున్నారు. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాలలో అనుకున్నంతగా యాసంగిలో సాగు జరగకపోవచ్చనని వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. కానీ చాలా చోట్ల మాత్రం రైతులు బోర్ల కింద సాగుకు సమాయత్తం అవుతున్నారు.

తక్కువ పంటకాలం రకాలకే మొగ్గు..

యాసంగిలో సైతం అతి తక్కువ పంట కాలం ఉన్న వంగడాలను సాగు చేయడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈనెల 15 వరకు నాట్లు పూర్తయితే మార్చి 15 నాటికి పంట చేతికొస్తుంది. తద్వారా తుపాన్లు, వడగళ్ల వానలు, ఈదురుగాలుల ప్రమాదం నుంచి పంటలను కాపాడుకోవచ్చని, 20 తేదీలోగా నాట్లు వేసుకోవడానికి వీలవుతుందని అధికారలు చెబుతున్నారు. ముందుగా నాట్లు వేయడం వలన ఎండల తీవ్రతకు నీటి సమస్య తగ్గిపోతుంది.

15 లోగా నార్లు పోసుకోవాలి..



యాసంగిలో సాగు చేయదలచినవారు ఈ నెల 15వ తేదీలోగా తక్కువ పంట కాలంలో ఉన్న వాటిని ఎంపిక చేసుకొని నార్లు పోసుకోవాలి. మార్చి చివరలో కోతలు కోసే విధంగా రైతులు ప్రణాళికలు రూపొందించుకోవాలి. సాగునీటి వనరులు ఉంటేనే సాగు చేయాలి.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

నారు పోసేందుకు సిద్ధం..



యాసంగిలో తక్కువ కాలంలో చేతికొచ్చే వరి విత్తనాలను నారు పోసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. మార్చి నాటికి పంట చేతికొచ్చేలా సాగుకు సిద్ధపడుతున్నా. దిగుబడి పెంచుకునేందుకు అధికారుల సూచనలు, సలహాల మేరకు యాసంగి సాగు చేయాలని అనుకున్నా.

– కాశిబోయిన అయోధ్య, రైతు, సింగారెడ్డిపాలెం

ఎన్నికల హడావుడి లేదు..



నెల రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పూర్తిగా పని చేశాం. ప్రస్తుతం యాసంగిలో నాటు వేసేందుకు వ్యవసాయ పనులు చేపట్టాం. భూగర్భ జలాలను బట్టి ఎన్ని ఎకరాలు సాగు చేయాలని ఆలోచిస్తున్నాం. కుటుంబపోషణ కోసమైనా యాసంగి వరిసాగు చేయక తప్పదు.

– బచ్చలకూరి నాగరాజు, రైతు, కోరట్లగూడెం

తుమ్మలను ఆశీర్వదించిన వేదపండితులు


తుమ్మలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావును భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థాన వేదపండితులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వదించారు. వారి వెంట దేవస్థాన ఈఓ రమాదేవి తదితరులున్నారు.

తుమ్మలను కలిసిన నాయకులు..

నేలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు మంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి తుమ్మలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేశ్, వెన్నపూసల సీతారాములు, పాకానాటి కన్నారెడ్డి, ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, కుక్కల హనుమంతరావు, భూక్యా రవి తదతరులు పాల్గొన్నారు.

తుమ్మలను గెలిపించిన యాదవులకు కృతజ్ఞతలు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న 45వేల మంది యాదవ కురుమలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి తుమ్మల నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాజకీయాలకు, వర్గాలకతీతంగా సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఎన్నెస్పీ స్థలంలో వెయ్యి గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్ కట్టిస్తానని, కార్పొరేషన్ పరిధిలో గొర్రెలకు బదులు పాడి గేదెలు ఇప్పిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. యాదవ కురుమలలో చీలిక తెచ్చి నచ్చనివారిపై అక్రమంగా కేసులు పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ నాయకుడు ఈర్ల వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, బమ్మిడి శ్రీనివాస్, పాపయ్య, వెంకన్న, నర్సింహారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుంటు మల్లన్న గ్రామోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బహుళ ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి వార్ల గ్రామోత్సవం(ఊరేగింపు) శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవాలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి చందూరు రామకోటేశ్వర స్వామి పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రావు, దాములూరి కృష్ణశర్మలు స్వామి వార్ల ఊరేగింపుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రీటౌన్ సీఐ సత్యనారాయణతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంతో మొక్కు చెల్లింపు


ఖమ్మంరూరల్: బొడ్రాయి వద్ద నాయకుల పూజలు

ఖమ్మంరూరల్/ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని, ముఖ్యమంత్రిగా రేవంతిరెడ్డి కావాలని, ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరరావు, పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయం సాధించాలని మొక్కుకున్నందుకు, మంత్రి పదవులు లభించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామంలోని బొడ్రాయి వద్ద 1,200 కొబ్బరి కాయలు కొట్టారు. తెల్దారుపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తమ్మినేని నవీన్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి 1,300 పైచిలుకు ఓట్లు ఆధిక్యం వచ్చేలా ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. అంతేకాక ఖమ్మం నగరం మామిళ్లగూడెంకు చెందిన అయ్యప్ప భక్తుడు పాయల కిషన్ మామిళ్లగూడెంలోని సాయిబాబా మందిరంలో బంధుమిత్రులతో కలిసి 101 కొబ్బరి కాయలకు కొట్టి మొక్కు చెల్లించుకున్నాడు. వట్టిపల్లి లక్ష్మీనర్సింహారావు, లక్కరాజు రామకృష్ణారావు, కూసూరు ప్రసాద్, సంపత్, పలివెల సుబ్బారావు, వనం రంగధామ్, శర్మ, నరికంటి శ్రీనివాస్, ఆలస్యం శేఖర్ పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన చరణ్‌రెడ్డి

కామేపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

ఖమ్మంవన్‌టౌన్: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో కాపులకు ప్రాతినిధ్యంలేదని మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జనాభాలో 22శాతం ఉన్న కాపులను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించి మంత్రి పదవి ఇచ్చి సముచితస్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల క్రిష్ణ, మాధురి మధు పాల్గొన్నారు.

శ్రీశైలం పాదయాత్రదారుడికి సంఘీభావం

నేలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఖమ్మం బస్ డిపో నుంచి శ్రీశైలం దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తున్న కాసాని వీరలింగయ్య యాదవ్ శుక్రవారం నేలకొండపల్లి రాగా కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేగూరి వాసవి, వాసవి సొసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం నాయకులు సత్యనారాయణ, హన్మంతరావు, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు తగిన న్యాయం చేయాలి

రఘునాథపాలెం: నిర్మాణ రంగ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వంలో తగిన న్యాయం చేకూర్చాలని ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన వెంకన్న కోరారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యాన రఘునాథపాలెంలో నిర్వహించిన మండల బీఓసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఇల్లు లేని కార్మికులకు ఇల్లు, రూ.ఐదు లక్షలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని, 50 ఏళ్ల దాటిన కార్మికులకు రూ. 5,000 పింఛన్ ఇవ్వాలని, లేబర్ ఆఫీసులో అవకతవకలను అరికట్టడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే..


కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

కామేపల్లి: సోషల్ మీడియాలో లేనిది ఉన్నట్లు అసత్యపు ప్రచారం చేసి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఖమ్మం ఆర్డీఓ గణేశ్, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పండితాపురం గ్రామానికి చెందిన ఇరువర్గాల నాయకులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చిన సందర్భంగా వారు మాట్లాడారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని, చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. గ్రామంలో అలర్లు, దాడులకు పాల్పడిన, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన బెండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు వారిని అరెస్ట్ చేసి జరిమానా విధిస్తామని, అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతి వాతావరణం కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలన్నారు. సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించడంతో పాటు గ్రామంలో ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించబడుతుందని, అందుకు పోలీసులకు ప్రజలంతా సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి


కూసుమంచి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి/ఖమ్మంమయూరిసెంటర్: మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడగా.. నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన శుక్రవారం కూసుమంచి తహసీల్దార్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తుపాన్ వల్ల మండలంలో వరి, పత్తి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లిందని, ఎకరం పత్తికి రూ.50 వేలు, మిర్చికి రూ.లక్ష, వరికి రూ.25వేల చొప్పున పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్ట పరిహారాన్ని శాస్త్రీయంగా అంచనావేసి రైతులకు పెట్టుబడితో పాటు కనీస కుటుంబ అవసరాలను తీర్చే విధంగా పరిహారం చెల్లించాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నాయకులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, డివిజన్ కార్యదర్శి ఐ.వెంకన్న, నాయకులు మాతండి రామస్వామి, చెరకుపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామిక చర్యలు మానుకోండి..

ఖమ్మంరూరల్: తెలంగాణలో బీఆర్‌ఎస్ ఇప్పటికైనా అప్రజాస్వామిక చర్యలను మానుకోవాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా కడియం శ్రీహరి లాంటి నేతలు అప్రజాస్వామిక పద్ధతిలో మాట్లాడుతున్నారని ఇది సరైంది కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెంది కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఇచ్చారని తెలిపారు. కానీ వారి అభీష్టాన్ని కాదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తే ప్రజలు బీఆర్‌ఎస్‌పై తిరగబడతారని హెచ్చరించారు. దశాబ్ద కాలం పాటు ప్రజల హక్కులను హరించి నిర్బంధాలతో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రజల మనోభావాలను ఏనాడు గౌరవించలేదన్నారు. వేలకోట్ల రూపాయల ప్రజాధనం బీఆర్‌ఎస్ పాలనలో దారి మళ్లిందన్న భావన ప్రజల్లో బలంగా ఉందని, ఇప్పటికైనా ప్రజల మనోభావాలను గుర్తించకుండా ప్రయత్నాలు చేస్తే శాశ్వతంగా బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు ఎం.చినవెంకటరెడ్డి, వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘విన్‌ఫీల్డ్’కు అవార్డు


అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: గత నెల 30న మలేషియాలోని కౌలాలంపూర్ టేలర్స్ యూనివర్సిటీలో నిర్వహించిన 11వ వరల్డ్ స్కూల్ సమ్మిట్‌లో విన్‌ఫీల్డ్ హైస్కూల్‌కు బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. ఈ అవార్డును ఫౌండర్ రోబోచాంప్ ఆకాశ్ అహుజ చేతుల మీదుగా పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, పోలావరపు శ్రీకాంత్, మన్నె కిషోర్ కుమార్ స్వీకరించారు. వీరిని పలువురు అభినందించారు.

నేడు విద్యార్థులతో కంపెనీల ప్రతినిధుల ముఖాముఖి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నేడు(శనివారం) తమ కళాశాలలోని విద్యార్థులకు పలు కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడుకు చెందిన ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) అకాడమీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఐసీటీ వరంగల్ రీజినల్ రిలేషన్‌షిప్ మేనేజర్ షేక్. గౌస్ పాషా, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ జి.ప్రవీణ్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, టీపీఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామేపల్లి/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంఅర్బన్: కామేపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాలతో పాటు ఖమ్మం నగరంలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈలు శ్రీనివాసులు, రవికుమార్, క్రాంతిసింహ, నాగేశ్వరరావు, భాస్కర్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా కూసుమంచి మండలంలోని పండితాపురం, కొత్తలింగాల, గోవింద్రాల, పాతలింగాల గ్రామాల ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం, పెదతండా, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు గ్రామపంచాతీల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఆరెంపుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యాన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు తిరుమలాయపాలెం మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, తిప్పారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అంతేకాక ఖమ్మం నగరంలోని టౌన్-2 రాపర్తినగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు, లైన్ క్లియరెన్స్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బస్ డిపోరోడ్, మయూరీ సెంటర్, వడ్డెర కాలనీ, మజ్దూర్ కాలనీ, లెనిన్ నగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. ఖమ్మం నగరంలోని బాలపేట ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలపేట, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు చిమ్మపుడిలో కార్తీక దీపోత్సవం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు కార్తీక దీపోత్సవం సామాజిక సమరసతావేదిక ఆధ్వర్యాన నిర్వహించబడుతుందని నిర్వాహకులు, వేదిక కన్వీనర్ భూక్యా బన్సీలాల్, గాడి సత్యనారాయణ, ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయంలో ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీకాంత్ తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు 83093 44403 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

11న కోటి దీపోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని సారధినగర్ ఎంబీ గార్డెన్స్ సమీపంలోని శివాలయం సన్నిధిలో మహా శ్రీ చక్రపీఠం వారి ఆధ్వర్యాన ఈ నెల 11వ తేదీ(సోమవారం) రాత్రి 7 గంటలకు కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సత్తెనపల్లి ఉమామహేశ్వరాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమిదలు వెలిగించే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. దీపాలు వెలిగించదలచిన భక్తులు 98482 20383 ఫోన్ నంబరును సంప్రదించాలని తెలిపారు.